సాక్షి
కుమురం భీం
మంగళవారం । 31 । అక్టోబర్ । 2023



రాత..దాటొద్దు గీత

ఎన్నికల బరిలో ఉన్న నేతలు సోషల్ మీడియాపై దృష్టి సారించారు. ఇష్టానుసారంగా పోస్టులు పెట్టే వారిపై పోలీసు యంత్రాంగం సైతం నిఘా ఉంచింది. IIలో▸



ఓటు నమోదుకు చివరి అవకాశం

అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటరు నమోదుకు నేటితో గడువు ముగియనుంది. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో 4,47,634 మంది ఓటర్లు ఉన్నారు. IIIలో▸

గరిష్టం/కనిష్టం
32.4 /19.5

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. పగలు ఎండగా, రాత్రి చల్లగా ఉంటుంది. చలి ప్రభావం స్వల్పంగా తగ్గుతుంది.

న్యూస్‌రీల్

ఆసిఫాబాద్ బీఎస్పీ అభ్యర్థిగా కనక ప్రభాకర్


కనక ప్రభాకర్

ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థిగా ఎస్టీ (ప్రధాన్) సామాజిక వర్గానికి చెందిన కనక ప్రభాకర్‌ను ఆ పార్టీ ఖరారు చేసింది. కెరమెరి మండలం గోయగాంకు చెందిన ప్రభాకర్ 1978 ఏప్రిల్ 1న జన్మించారు. బీఏ చదివిన ఆయన హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. 1996 నుంచి రాజకీయాల్లో చురుగ్గా ఉన్నారు.

తనిఖీల్లో రూ.1,78,58,686 పట్టివేత


ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద ఇప్పటివరకు రూ.1,78,58,686 నగదు పట్టుకున్నామని ఎస్పీ సురేశ్‌కుమార్ తెలిపారు. సోమవారం జిల్లాలోని పలు చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు రూ.50 వేల కంటే అధికంగా నగదు, బంగారం, ఇతర వస్తువులు తీసుకెళ్తే ఆధారాలు చూపాలన్నారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా రూ.6,55,565 విలువైన 1,146 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని, రూ.3,19,982 విలువైన 182 మొబైల్ ఫోన్లు, రూ.7 వేల విలువైన 100 టిఫిన్ బాక్స్‌లు సీజ్ చేశామని వెల్లడించారు. రౌడీషీట్, సస్పెక్ట్, చెడు నడత గల 1,661 మందిని బైండోవర్ చేశామని పేర్కొన్నారు.

నామినేషన్ల ప్రక్రియ సజావుగా చేపట్టాలి


వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ఆసిఫాబాద్: నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల నిర్వహణ సజావుగా చేపట్టాలని ఎన్నికల సీనియర్ డిప్యూటీ కమిషనర్ నితేశ్ వ్యాస్ అన్నారు. సోమవారం న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, పోలీసు అధికారులు, రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్, రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేయాలన్నారు. నామినేషన్లు పూర్తిగా పరిశీలించి, పొరపాట్లు ఉంటే వెంటనే సంబంధిత అభ్యర్థులకు లిఖితపూర్వకంగా సమాచారం ఇవ్వాలన్నారు. ఓటరు నమోదుకు వచ్చిన దరఖాస్తులను పూర్తిగా పరిశీలించాలని, ఎన్నికలకు వారంరోజుల ముందే పోలింగ్ స్లిప్‌లు ఓటర్లకు పంపిణీ చేయాలన్నారు. పోలింగ్ రోజు అదనపు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ హేమంత్ బోర్కడే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఎస్పీ సురేశ్ కుమార్ వీసీలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో 597 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటికే రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి సూచనలిచ్చామన్నారు. సమావేశంలో డీఎస్పీలు వెంకటరమణ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రం పరిశీలించిన ఎస్పీ


పీటీజీ పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని ఎస్పీ సురేశ్‌కుమార్ సోమవారం అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి పరిశీలించారు. అనంతరం పీటీజీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్, రిసిప్షన్ రూమ్‌తోపాటు సాంఘిక సంక్షేమ పాఠశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. నామినేషన్ కేంద్రం నుంచి 100 మీటర్ల దూరం వరకు బారికేడ్లు ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద వన్‌ప్లస్ ఫోర్ గార్డ్ పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశామని తెలిపారు.

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం ఎస్పీ సురేశ్‌బాబు, అదనపు కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించారు. కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, సీఐ సాదిక్‌పాషా, ఎస్సై రమేశ్ ఉన్నారు.

అసమ్మతి సెగ!

- అసంతృప్తుల నిరసన గళం
- టిక్కెట్ దక్కక రోడ్డెక్కిన నేతలు
- రాజీనామాలు.. ఓడిస్తామనే శపథాలు



సాక్షి, ఆసిఫాబాద్: రానున్న శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసి సత్తా చాటాలని భావించిన ప్రధాన పార్టీ నేతలకు టిక్కెట్లు దక్కకపోవడంతో ఒక్కసారిగా అసంతృప్తి పెల్లుబికింది. కొందరు పార్టీ మారడానికి సిద్ధమవ్వగా.. మరికొందరు రోడ్డెక్కి ఆందోళనలకు దిగుతున్నారు. ఆసిఫాబాద్ టికెట్ ఇవ్వకపోవడంతో కాంగ్రెస్ నేతలు డాక్టర్ గణేష్ రాథోడ్, మర్సుకోల సరస్వతి, వారి అనుచరులు జిల్లా కేంద్రంలో రోడ్డెక్కి ఆందోళన చేశారు. మర్సుకోల సరస్వతి ఒక అడుగు ముందుకేసి పార్టీ మారేందుకు సిద్ధపడ్డారు. కమలం నేతల్ని కలిసి టికెట్ హామీ పొందినట్లు ప్రచారం జోరందుకోగా.. కొన్నేళ్లుగా ఆ పార్టీలో ఉంటూ టికెట్ ఆశిస్తున్న ఆసిఫాబాద్ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తుండడం చర్చనీయాంశమైంది.

కాంగ్రెస్ అధిష్టానం విడుదల చేసిన రెండో జాబితా ఆసిఫాబాద్ జిల్లా పార్టీ నేతల్లో తీవ్ర అసంతృప్తికి దారి తీసింది. ఇటీవల చేరిన వ్యక్తికి ఆసిఫాబాద్ టికెట్ కేటాయించడంపై నిరసన వ్యక్తమవుతోంది. అధికారంలో లేకున్నా పార్టీ జెండా మోసిన నాయకుల్ని విస్మరించడాన్ని తప్పుపడుతున్నారు. 'ఎమ్మెల్యే టికెట్ వస్తుందని ఆశతో పార్టీ కార్యక్రమాలు, బహిరంగ సభలకు కార్యకర్తలు, ప్రజలను తరలించాం.. కోట్లాది రూపాయలు ఖర్చు చేసిన వారిని విస్మరించి కొత్తగా చేరిన వారిని అభ్యర్థిగా ఎలా ప్రకటిస్తారు' అని కొందరు ముఖ్య నాయకులు ప్రశ్నిస్తున్నారు.

పార్టీ మారే యోచన..?

ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్న నేతలను కాదని ప్యారాషూట్‌లకు టికెట్ ఇచ్చారని పలువురు నేతలు ఆరోపిస్తున్నారు. దీనిపై నియోజకవర్గంలోని కొన్ని మండలాల నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తనకు టికెట్ దక్కకపోవడంపై మాజీ మంత్రి కోట్నాక భీంరావు తనయ మర్సుకోల సరస్వతి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీనే నమ్ముకుని పనిచేసిన తనని కాదని మూడు నెలల కిందట పార్టీలో చేరిన స్థానికేతరుడైన శ్యాంనాయక్‌కు టికెట్ ఇవ్వడం వెనుక మతలబు ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. 'మా నాన్న హయాం నుంచి మాకు ప్రజలతో సత్సంబంధాలు ఉన్నాయి. 2002 నుంచి నేను కాంగ్రెస్ పార్టీలో ఉన్నాను. రేవంత్‌రెడ్డే నన్ను మళ్లీ పార్టీలోకి ఆహ్వానించారు. కుమురంభీం గడ్డలో కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ మహిళను అవమానించింది. కాంగ్రెస్ అధిష్టానం పైసలు తీసుకుని పార్టీ టికెట్లను అమ్ముకుంది. త్వరలో నా కార్యాచరణ ప్రకటిస్తా.. నేను బరిలో ఉంటా.. శ్యాంనాయక్‌ను ఓడిస్తా' అని సరస్వతి శపథం చేశారు. నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతానంటున్న సరస్వతి బీజేపీ రాష్ట్ర అధినేత కిషన్‌రెడ్డిని ఆదివారం రాత్రి కలిసినట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో తనకున్న పట్టు గురించి వివరించి.. టికెట్ కోరినట్లు సమాచారం. పార్టీ టికెట్ ఇస్తే ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులకు దీటుగా ఎలా ముందుకెళ్తామనే విషయాలతోపాటు క్షేత్రస్థాయిలో తమ బలాలు, పోటీదారుల బలహీనతలను వివరించే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. కమలం బాసు కూడా సానుకూలంగా స్పందించినట్లు ఆమె అనుచరులు పేర్కొంటున్నారు. రెండు రోజుల్లో ఆమె పార్టీ మారుతుందనే ప్రచారం నియోజకవర్గంలో జోరుకుంది.

భవిష్యత్తు కార్యాచరణ

ఆసిఫాబాద్ నియోజకవర్గంలో టీపీసీసీ సభ్యుడు డాక్టర్ గణేష్ రాథోడ్ కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయాలను ప్రశ్నించారు. శనివారం అనుచరులతో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకుంటున్నారు. కష్టకాలంలో ఉన్న సమయంలో పార్టీ జెండా మోసిన తనకు టికెట్ ఇవ్వకుండా ఒట్టి చేతులు చూపారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధిష్టానం తీరుకు నిరసనగా రోడ్డెక్కి ఆందోళన చేశారు. అయితే అధిష్టానం ఆయనను ఢిల్లీకి పిలిచి ముందుగానే బుజ్జగించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయన శ్యాంనాయక్‌కు సహకారం అందిస్తారా? ఏం చేస్తారనేది ఆసక్తిగా మారింది.

అన్నీ సమస్యాత్మకమే!

- ఐదు నియోజకవర్గాలపై ఈసీ ప్రత్యేక దృష్టి
- మంచిర్యాల జిల్లాలో మూడు
- కుమురంభీం జిల్లాలో రెండు..
- ఈ నియోజకవర్గాల్లో సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్
- కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశం

మంచిర్యాల జిల్లా	
మావోయిస్టు ప్రభావిత కేంద్రాలు	48
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు	82
సెల్‌ఫోన్ సిగ్నల్ లేని కేంద్రాలు	19
మొత్తం పోలింగ్ కేంద్రాలు	726

కుమురంభీం జిల్లా	
మావోయిస్టు ప్రభావిత కేంద్రాలు	73
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు	92
సెల్‌ఫోన్ సిగ్నల్ లేని కేంద్రాలు	48
మొత్తం పోలింగ్ కేంద్రాలు	597

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించేదుకు కేంద్ర ఎన్నికల కమిషన్(సీఈసీ)చర్యలు చేపట్టింది. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృష్టిసారించింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సమస్యాత్మక నియోజకవర్గాలను ఈసీ సోమవారం ప్రకటించింది. ఈ జాబితాలో మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల పరిధిలోని చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల, సిర్పూర్(టి), ఆసిఫాబాద్ నియోజకవర్గాలు ఉన్నాయి.

ఇలా గుర్తింపు..

గతంలో ఆయా నియోజకవర్గాల్లో జరిగిన ఘటనలు, ఎన్నికల నిర్వహణకు ఎదురైన ఇబ్బందుల ఆధారంగా ఈసీ సమస్యాత్మక నియోజకవర్గాలను ప్రకటించింది. పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది చేరుకోవడానికి ఎదురయ్యే ఇబ్బందులు, ఇంటర్‌నెట్, సెల్‌ఫోన్ సిగ్నల్ లేని గ్రామాలు, దట్టమైన అటవీ ప్రాంతం, ఎన్నికల సామగ్రిని పోలింగ్ కేంద్రానికి తరలించడానికి ఎదురయ్యే ఇబ్బందులు, మావోయిస్టు ప్రభావం తదితర అంశాలను కూడా ఎన్నికల సంఘం పరిగణనలోకి తీసుకుని ఐదు నియోజకవర్గాలను సమస్యాత్మకంగా ప్రకటించింది.

సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్..

సాధారణ నియోజకవర్గాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. సమస్యాత్మక నియోజకవర్గాల్లో మాత్రం గంట ముందే పోలింగ్ ముగుస్తుంది. ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ నిర్వహిస్తారు.

చీకటి పడకముందే స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంలు..

సమస్యాత్మక నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలను చీకటి పడకముందే స్ట్రాంగ్ రూంలకు తరలించేలా ఈసీ చర్యలు చేపట్టింది. ఈమేరకు జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అందుకు ప్రణాళిక రూపొందించాలని ఈసీ స్పష్టం చేసింది.

ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక దృష్టి..

మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలు ఒకప్పుడు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు. రెండు దశాబ్దాల క్రితం చాలా గ్రామాల్లో మావోయిస్టుల ప్రభావం ఉండేది. ప్రస్తుతం మావోయిస్టుల ప్రాబల్యం లేకపోయినా.. ఎన్నికలను పటిష్టంగా నిర్వహించాలనే ఉద్దేశంతోనే ఈసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మావోయిస్టు ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాల్లోని అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న గిరిజన పల్లెలు, మారుమూల గ్రామాలు సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు. ఆసిఫాబాద్, సిర్పూర్(టి) నియోజకవర్గాలకు సరిహద్దున మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌తోపాటు రెండు నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాలు కూడా సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు. జిల్లాలోని చాలా గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడం, దట్టమైన అటవీ ప్రాంతం ఉండడంతో సమస్యాత్మకంగా గుర్తించినట్లు తెలిసింది.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- పార్టీ గెలుపునకు కలిసికట్టుగా పనిచేయాలి
- బీఆర్ఎస్ అభ్యర్థి, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

కెరమెరి(ఆసిఫాబాద్): పంతాలు.. పట్టింపులు లేకుండా పార్టీ గెలుపు కోసం కలిసికట్టుగా పనిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ అభ్యర్థి, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి సోమవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోవ లక్ష్మి మాట్లాడుతూ పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఎన్నడూ గ్రామాల ముఖం చూడని వారు సైతం ఓటు కోసం వస్తారని, అలాంటి వారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కులాలు, మతాల పేరిట విద్వేశాలు రెచ్చగొట్టే వారికి తగిన సమాధానం చెప్పాలన్నారు.

మండల, బూత్‌స్థాయి కమిటీలను పర్యవేక్షిస్తాం

మండల, బూత్‌స్థాయి కమిటీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. నవంబర్ 8న ఆసిఫాబాద్‌కు సీఎం కేసీఆర్ వస్తారని, 9న కోవ లక్ష్మి నామినేషన్ వేస్తారని తెలిపారు. ఆయా కార్యక్రమాలకు కార్యకర్తలు భారీగా తరలిరావాలని కోరారు. కష్టపడితే ఎక్కువ ఓట్లు కెరమెరి మండలం నుంచే వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ పెందోర్ మోతీరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతాబాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్‌కలాం, ప్రజాప్రతినిధులు, నాయకులు న్యానేశ్వర్, తుల్సీరాం, జగన్నాథ్‌రావు, ఇస్తేకార్, ఉత్తం నాయక్, యూసూస్, రఘునాథ్, బొజ్జిరావు, రూప్‌లాల్, అంబాయి, శివాజీ, లక్ష్మణ్, దండు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఎస్పీ సురేశ్‌కుమార్‌తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు చేసే ప్రతీ ఖర్చు వివరాలను నమోదు చేయాలని సూచించారు. నామినేషన్ దాఖలైన నాటి నుంచి పోలింగ్ తేదీ వరకు ఖర్చుల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. వ్యయ పరిశీలకుల కమిటీ వద్ద ఉన్న ఖర్చుల వివరాలు, అభ్యర్థుల వద్ద ఉన్న ఖర్చుల వివరాల్లో తేడా ఉండొద్దని పేర్కొన్నారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు రిజిస్టర్లను మూడుసార్లు తనిఖీ చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలకు తప్పనిసరిగా ముందస్తు అనుమతి పొందాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే అభ్యర్థులు బ్యాంకులో ఖాతాలు తెరవాలని, హెలిప్యాడ్ కోసం ముందస్తు అనుమతులు పొందాలని సూచించారు. డీఎస్పీలు వెంకటరమణ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన పూర్తి చేస్తేనే ఓటేస్తాం

- ఎన్నికలను బహిష్కరిస్తామని తీర్మానించిన గుండి గ్రామస్తులు
- బ్రిడ్జి పిల్లర్ల దశను దాటకపోవడంపై ఆగ్రహం
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా.. అంటూ ఆవేదన


ఎన్నికలు బహిష్కరిస్తామని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



పిల్లర్ దశలో గుండి వంతెన

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆసిఫాబాద్ మండలం గుండి గ్రామానికి వెళ్లే దారిలో వాగుపై వంతెన ఏళ్లుగా అసంపూర్తిగా ఉంది. బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసే వరకు అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తామని గ్రామస్తులు ప్రకటించారు. అంతేకాక ఏ రాజకీయ పార్టీ తమ గ్రామంలోకి ప్రచారం కోసం రావొద్దని ఫ్లెక్సీ సైతం ఏర్పాటు చేశారు. తమ బాధలు, కష్టాలు ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలియాలనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

పిల్లర్ల దశలో ఆగిన పనులు

2006లో రూ.2.75కోట్లు గుండి వంతెన నిర్మాణానికి మంజూరయ్యాయి. 2009తో అంచనా వ్యయాన్ని రూ.3.80 కోట్లకు పెంచి పనులు ప్రారంభించారు. అయితే పిల్లర్ల దశకు చేరుకున్న తర్వాత పనులు నిలిపివేశారు. 2016లో మళ్లీ వంతెన కోసం రూ.8.40కోట్లు మంజూరు చేశారు. గుండి గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్లు అప్పటి ఓ ప్రజాప్రతినిధి ప్రకటించారు. అయినా పనులు పూర్తికాలేదు. 2019లో మరోసారి వంతెనను వరదలకు తగినట్లుగా రీడిజైనింగ్ చేసి, పిల్లర్ల ఎత్తును పెంచాలని నిర్ణయించారు. దీంతో ప్రభుత్వం రూ.11.30 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటివరకు పనులు ప్రారంభానికి నోచుకోలేదు. గ్రామస్తులు పలుమార్లు అధికారులకు విన్నవించడమే కాకుండా.. ఇటీవల కలెక్టరేట్ ముట్టడి నిర్వహించినా ప్రయోజనం లేకుండా పోయింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో 'సాక్షి' ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఎజెండాలో గుండి వాగుపై వంతెన నిర్మాణం పూర్తిచేయాలని గ్రామస్తులు కోరారు.

ఓటు వేయం..



గుండి గ్రామానికి వంతెన పూర్తి చేసేవరకు ఇక్కడ ఎన్నికలు నిర్వహించొద్దు. ఎలక్షన్లు బహిష్కరించాలని అందరం కలిసి తీర్మానించుకున్నాం. మా బాధ తీరే వరకు ఓటు వేయం.

– విజయ్

30 కి.మీ. తిరగాలి



జిల్లా కేంద్రానికి మా గ్రామం మూడు కిలోమీటర్ల దూరంలోనే ఉంది. అయితే వంతెన లేక 30 కిలోమీటర్లు తిరిగి ఆసిఫాబాద్‌కు వెళ్లాలి. రాకపోకలకు ఆటోచార్జీలు రూ.200 అవుతాయి. బ్రిడ్జి పూర్తి చేసి కష్టాలు తీర్చాలి.

– సతీష్


వైద్యం అందక చనిపోతున్నరు



అత్యవసర సమయంలో ఊరికి 108 వాహనం కూడా రాలేని పరిస్థితి. ఇక్కడి నుంచి జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి వెళ్లేసరికి నాలుగైదు గంటలు పడుతుంది. సకాలంలో వైద్యం అందక ఇటీవల విద్యుత్ షాక్‌తో ఒకరు, పురుగుల మందు తాగిన మరో ఇద్దరు చనిపోయారు. బ్రిడ్జి ఉంటే బతికేవారు.

– వైరగాడే రాహుల్

విన్నవించినా.. పట్టించుకోలేదు



వంతెన లేక గ్రామస్తులు నానా కష్టాలు పడుతున్నారు. గతంలో రెండుసార్లు గ్రామపెద్దలు, మహిళలతో కలిసి ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినం. అయినా ఎవరూ పట్టించుకోలేదు. పనులు పూర్తి చేసి మా సమస్యలు పరిష్కరించాలి.

– కోలే అరుణ, సర్పంచ్

పట్టించుకున్న వారు లేరు



గుండి గ్రామం ఏర్పడి 180 ఏళ్లు అవుతుంది. ఇప్పటివరకు మా బాధలు పట్టించుకున్న వారు లేరు. ఎన్నికలు వస్తేనే గ్రామానికి వస్తున్నారు. తర్వాత మర్చిపోతున్నారు. ఈ సారి ఎన్నికలను బహిష్కరిస్తున్నాం.

– కవల్కార్ లక్ష్మి

వర్షాకాలం ఇంట్లోనే..



భారీ వర్షాలు కురిసే మూడు నెలలు మా పిల్లలను బడికి పంపలేని పరిస్థితి. వాగు ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు ఇంట్లోనే ఉంటారు. కొంతమంది మాత్రం ఆసిఫాబాద్‌లో రూం కిరాయి తీసుకుని ఉంటరు. మా కష్టాలు పిల్లలకు రావొద్దు.

– కోలే తారాబాయి

పిల్లల కోసమే..



వాగుపై వంతెన లేక తాతల కాలం నుంచి ఇబ్బంది పడుతున్నం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఇక్కడ బ్రిడ్జి కట్టలే.. మా పిల్లలు రోజూ స్కూల్‌కు పోవాలంటే మాకు వంతెన కావాలే.. పిల్లల కోసమే ఓటు వేయొద్దని నిర్ణయం తీసుకున్నం.

– సాగర్

18 ఏళ్ల నుంచి..



2006లో వంతెన నిర్మాణానికి భూమి పూజ చేస్తే ఇప్పటికీ పిల్లర్ల దశలోనే ఉంది. అప్పటి నుంచి మరో రెండుసార్లు భూమిపూజలు చేశారు. పనులు మాత్రం పూర్తి చేయలేదు. ఎవరూ పట్టించుకుంట లేరు.

– కిరణ్

రాజీనామా చేశా..

ఎన్నికల సమయంలో గ్రామస్తులకు వంతెన పనులు పూర్తయ్యేలా కృషి చేస్తా అని హామీ ఇచ్చినా. ఇప్పటికీ హామీని నిలబెట్టుకోలేకపోయా. అందుకే ఉప సర్పంచ్ పదవికి రాజీనామా చేసిన. ప్రజల నిర్ణయమే నా నిర్ణయం.

– బొట్టుపల్లి శేషాద్రి

క్లుప్తంగా

రైలు ప్రమాదంలో యువకుడికి గాయాలు



సాయిని ఆసుపత్రికి తరలిస్తున్న యువకులు

తాండూర్: రైలు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. సోమవారం ఉదయం మండలంలోని బోయవాడకు చెందిన భోగి సాయి తాండూర్ బస్టాండ్ సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్‌ను దాటుతుండగా రైలు ఢీకొట్టింది. తీవ్రగాయాలైన సాయి ప్రాణాలతో ట్రాక్‌పై కొట్టుమిట్టాడుతూ ఉన్నాడు. గమనించిన యువకులు పోలీసులు, రైల్వే అధికారులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకుని ఆసుపత్రికి తరలించారు. గాయాలతో సాయి ట్రాక్‌పై పడి ఉండడంతో గూడ్స్ రైలు కొంతసేపు నిలిచిపోయింది. సాయి ప్రాణాలను కాపాడిన సంపత్, భీమేష్‌ను పలువురు అభినందించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెండోజోన్‌లో ఆదివారం రాత్రి పేకాటస్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశామని ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.27,100 నగదును స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. అదనపు ఎస్సై హరిశేఖర్, ఏఎస్సై మల్లేశ్, కానిస్టేబుల్ మహేశ్ ఉన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

సిర్పూర్(టి): మండలంలోని ఆరెగూడ సమీపంలోని ఓ నీటికుంటలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. పెద్దబండ గ్రామానికి చెందిన ఓ యువకుడు.. మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. కౌటాల సీఐ సాదిక్‌పాష, ఎస్సై డికొండ రమేశ్‌లు సోమవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వివరాలు సేకరించగా అందాజ (35)ని గుర్తించారు. ప్రమాదవశాత్తు నీటికుంటలో జారి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు.

సింగరేణిలో ప్రచారం నిషేధం

మందమర్రిరూరల్: సింగరేణిగనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద ఎన్నికల ప్రచారం నిషేధమని, ఉద్యోగులు ఎన్నికల ప్రచారానికి హాజరైతే క్రమశిక్షణ చర్యలు తప్పవని ఏరియా పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంస్థ సర్క్యులర్ ఆర్‌పీ/పీఈఆర్/ఐఆర్/డీ/98/1251 ప్రకారం సింగరేణి గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద పార్టీల అభ్యర్థులకు ప్రచారానికి అనుమతి లేదని వివరించారు.

పాటకు జై.. ప్రచారానికి సై

- ప్రత్యేక గీతాలతో హోరు
- పార్టీ, అభ్యర్థుల ప్రత్యేక పాటలు రికార్డింగ్
- ఓటర్లను ఆకర్షించేలా వ్యూహాలు



నృత్యాలతో అలరిస్తున్న కళాకారులు (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: జిల్లాలో రాజకీయ పార్టీల ప్రచారసందడి షురువైంది. గోడరాతలు పోస్టర్లు సభలు సమావేశాలకు తోడుగా ప్రత్యేక గీతాలతో పార్టీలు, అభ్యర్థుల గుణగణాలు, హామీలు, పథకాలు వంటి వాటితో ప్రత్యేక పాటలను రికార్డింగ్ చేయించారు. జనాల మధ్య పాటల్ని పెద్ద లౌడ్‌స్పీకర్లలో పెడుతున్నారు. విభిన్నమైన ప్రచార సాధనాలు వినియోగిస్తున్నారు. దసరా నవరాత్రులు పూర్తవడంతో క్రమంగా ప్రచారపర్వాన్ని ఉధృతం చేశారు. ప్రధాన రాజకీయ పార్టీలతోపాటు ఆయా అభ్యర్థులు తమ పార్టీల పథకాలను గుర్తుతెచ్చేలా పాటలను ప్రత్యేకంగా కంపోజ్ చేయించి రికార్డు చేశారు. కాగా ఈ పాటల్ని డిజిటల్ విధానంలో లౌడ్‌స్పీకర్లలో ఆకట్టుకునే సంగీతంతో ప్రజలకు వినిపించేందుకు ప్రత్యేక వాహన ఏర్పాట్లు చేస్తున్నారు.

కార్యకర్తల్లో జోష్

ఆయా రాజకీయ పార్టీలు డీజే సౌండ్ బాక్స్‌తో కూడిన ఆకట్టుకునే రీతిలో వినూత్నంగా సంగీతంతో కూడిన పాటలతో హోరెత్తిస్తున్నారు. ఎల్‌ఈడీ తెరలపై పార్టీ అభ్యర్థుల హామీలు, మేనిఫెస్టో, నేపథ్యం చాటిచిత్రాలు, వీడియోలతో బ్యాగ్రౌండ్‌లో పాటలను ఆసక్తి పెంచేలా తయారు చేస్తున్నారు.

గ్రామాల్లో ప్రచార సందడి

నవరాత్రోత్సవాలు పూర్తవడంతో ప్రచార పర్వం ఊపందుకుంది. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో పరిధిలోని గ్రామాల్లో ప్రచారం మొదలైంది. డీజే సౌండ్ బాక్స్‌లతో కూడిన అభ్యర్థులు, పార్టీలకు సంబంధించి ప్రచారహోరు ఎక్కడికక్కడ కనిపిస్తోంది. జిల్లాలో ప్రధానంగా మూడు పార్టీల అభ్యర్థులతో కూడిన ప్రచారం కనిపిస్తుంది. ఇప్పటికే నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఖరారు కొలిక్కి రావడంతో ప్రచార రథాలు సైతం రోడ్డెక్కాయి. మైక్ సెట్, మాట్లాడేందుకు స్పీకర్లతో కూడిన సౌకర్యాలతో అవి సిద్ధమయ్యాయి. దీనికితోడు డ్రైవర్ మాత్రమే కలిగి ఉండే పార్టీ ప్రచారాన్ని సూచించే పాటలతో కూడిన వాహనాలను ఓటర్లను ఆకట్టుకునేలా తీర్చిదిద్ది గ్రామాల వెంట తిప్పుతున్నారు.

ఇప్పటికే డీజేతో కూడిన ప్రత్యేక వాహనాల్లో పాటల సందడి మొదలైంది. పార్టీ కోసం అభ్యర్థి కోసం రాయించిన పాటలను వినిపిస్తూ ఓటర్లను ఆకట్టుకునేలా ప్రయత్నం చేస్తున్నారు.

అభ్యర్థి, పార్టీ..పాటలు ప్రత్యేకం

ఆయా పార్టీల అభ్యర్థులు ప్రత్యేకంగా తమ పేర్లతో కూడిన పాటలను రికార్డు చేయించుకున్నారు. తమ పేరు వచ్చేలా కనీసం మూడు నుంచి ఐదు పాటలు రాయించి ప్రత్యేక సంగీతంతో ఆకట్టుకునేలా రికార్డింగ్ చేయించారు. ఇక ఆయా పార్టీల అధిష్టానం ఇచ్చే పాటలు అదనం. ఇందులో సాహిత్యం మొత్తం పార్టీ, పథకాలను సూచించేవిధంగా ఉంటున్నాయి. ప్రత్యేకంగా వీటి కోసం దాదాపు 6 నుంచి 8 పాటలు సిద్ధం చేశారు. ఇక ఈ పాటలను ఎల్‌ఈడీ తెరలపై వీడియోలు జతచేస్తూ ముస్తాబు చేశారు. పాటల రచయిత, సంగీత దర్శకుడు, స్టూడియో, వాయిద్యాకారులు, గాయకులు వీడియో ఎడిటింగ్ కలిపి మొత్తం ఖర్చు చెల్లించాల్సి ఉంటుంది.

కళాజాత బృందాలు బిజీబిజీ

ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధానంగా మూడు పార్టీల అభ్యర్థులు బరిలో ఉంటున్నారు. ఒక్కో పార్టీకి మూడు కళాజాత బృందాలు అవసరం ఉంటున్నాయి. నియోజకవర్గంలో ఒక బృందం అభ్యర్థి వెంట మిగతా రెండు బృందాలు ఇతర మండలాల్లో ప్రచారం నిర్వహించడానికి కార్యాచరణ చేస్తున్నారు. ఓటర్లను ఆకట్టుకుంటూ ప్రవేశపెట్టిన పథకాలు, ఇచ్చే హామీలు ప్రజల్లోకి చేరువ చేసేందుకు కళాజాత బృందాలు శ్రమించనున్నాయి. స్థానిక భాషలో అర్థమయ్యేలా బృందాలు పాటలు, గాత్ర రూపంలో పనిచేయనున్నాయి. ఇందుకు జానపద కళాకారులు బృందాలను ఆయా పార్టీలు ముందస్తు ఒప్పందాలు చేసుకుంటున్నాయి. రానున్న 30 రోజులపాటు ఉధృత ప్రచార హోరు కనిపించనుంది.



పాటలు పాడుతున్న కళాకారుల బృందం సభ్యులు (ఫైల్)

రాత.. దాటొద్దు గీత



- సామాజిక మాధ్యమాలపై పోలీస్ శాఖ నిఘా
- ఎమ్మెల్యే అభ్యర్థుల పేర్లతో వాట్సాప్ గ్రూప్‌లు

నిర్మల్‌చైన్‌గేట్: అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రచార పర్వం వేడెక్కుతుంది. బరిలో ఉన్న నేతలు ఓటర్లను ఆకట్టుకునేందుకు సామాజిక మాధ్యమాలపై దృష్టిసారిస్తున్నారు. వాట్సాప్, ఎక్స్ ఖాతా, ఇన్‌స్టాగామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్‌తోపాటు మరికొన్ని సోషల్ మీడియా వేదికగా చేసుకుంటున్నారు. జిల్లాలో పలువురు నేతలు ఇప్పటికే వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసుకోగా, పోస్టు చేసేందుకు యువకులు, బృందాలను నియమించుకుంటున్నారు. ఇక ఫేస్‌బుక్, ఎక్స్ ఖాతాను విద్యార్థులు, యువత ఎక్కువగా వినియోగిస్తున్నారు.

ఓటర్లకు చేరవేసేలా..

ఫేస్‌బుక్‌లో ఎమ్మెల్యేల అభ్యర్థులు, ఆశావాహుల అభ్యర్థుల పేర్ల మీద యువసేన పనిచేస్తోంది. ఇందులో యువతే అధికంగా ఉండడంతో ఆయా పార్టీలకు ఉపయోగపడనుంది. నియోజకవర్గాల వారీగా వాట్సాప్ ద్వారా తమ సందేశాన్ని తెలిపేందుకు యత్నిస్తున్నాయి. ఇందుకు ఓటర్ల సెల్‌ఫోన్ నంబర్లు అవసరం. వాటి సేకరణ బాధ్యత గ్రామాల పార్టీ శ్రేణుల నుంచి తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారు. ముఖ్యంగా గ్రామాల బాధ్యులతో పార్టీ ప్రచార సందేశాన్ని ఓటర్లకు చేరవేసే ప్రయత్నం చేస్తున్నారు.

వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా అధ్యయనం

బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులు ఇప్పటికే ఖరారు కావడంతో ప్రచారం ఆరంభమైంది. నాయకుల అనుచరుల ప్రచారం, ఫొటోలు, వీడియోలను ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తున్నారు. పార్టీలు ఇప్పటికే గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేస్తున్నారు. ఇది కాకుండా నేరుగా ఎమ్మెల్యే అభ్యర్థిని చేరుస్తూ నియోజకవర్గ ముఖ్య నాయకుల గ్రూప్ ఒకటి ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. జిల్లాకేంద్రానికి సమీపంలోని నియోజకవర్గ తాజా, మాజీ ఎమ్మెల్యే గ్రామస్థాయిలో అసంతృప్తులు, ప్రజలేమనుకుంటున్నారు.. ఏం కోరుకుంటున్నారు..అనే విషయాలను గ్రామస్థాయి కార్యకర్తల వాట్సాప్ గ్రూప్ ద్వారా అధ్యయనం చేస్తున్నారు. దీన్ని ఆధారంగా చేసుకుని ప్రచారంలో వ్యూహాలు రూపొందిస్తున్నట్లు తెలిసింది. నాయకుల కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా వారి తరఫున సామాజిక మాధ్యమాల ఖాతాలను నిర్వహిస్తున్నారు. అందులో నాయకుల కటౌట్లతో ఫొటోలను తయారు చేసి ప్రచారం చేస్తున్నారు.

ఉల్లంఘిస్తే ఫిర్యాదు చేయవచ్చు

ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. క్షణాల్లో వదంతులు సృష్టించి వ్యాప్తిచేసే సోషల్ మీడియాపై నిఘా ఉంచారు. ఇష్టానుసారంగా పోస్టులు పెడుతూ శాంతియుత వాతావరణానికి భంగం కలిగించే వారిపై నిఘా పెట్టారు. ఇప్పటికే ఎన్నికల సంఘం సాంకేతికతను వినియోగించుకుంటోంది. అభ్యర్థులు ఎవరైన నియమావళి ఉల్లంఘిస్తే ఎవరైనా ఫొటోలు, వీడియోలు తీసి సంబంధిత అధికారికి ఫిర్యాదు చేయవచ్చు.

అవినీతి నిర్మూలనలో భాగస్వాములు కావాలి

మందమర్రిరూరల్: అవినీతి నిర్మూలనలో సింగరేణీయులు భాగస్వాములు కావాలని ఏరియా జీఎం మనోహర్ పిలుపునిచ్చారు. సింగరేణి విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా ఏరియా జీఎం ఆఫీస్ ఆవరణలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ నవంబర్ 5 వరకు సింగరేణిలో విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా అవినీతి నిర్మూలనకు ఉద్యోగులను చైతన్యపర్చి అవినీతి లేని సింగరేణిగా చూడాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. అనంతరం విజిలెన్స్ సమగ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఏరియా పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్, ఐఈడీ రాజన్న, ఎస్టేట్ అధికారి కుమారస్వామి, ఎన్విరాన్‌మెంట్ అధికారి ప్రభాకర్, ఐటీ ప్రోగ్రామర్ రవి, డీవైపీఎం ఆసిఫ్, ఆఫీస్ ఉద్యోగాలు ఉన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న జీఎం మనోహర్

జైపూర్: ఎస్టీపీపీలో సోమవారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. అడ్మిన్ భవన కార్యాలయంలో సమగ్రత ప్రతిజ్ఞ చేశారు. సీటీసీ సంజయ్‌కుమార్ సూర్, జీఎం చిన్న బసివిరెడ్డి, వోఅండ్‌ఎం చీఫ్ జెన్‌సింగ్, ఏజీఎంలు ప్రసాద్, సుధాకర్, విజిలెన్స్ అధికారి రామబ్రహ్మం, వేణుగోపాల్, పర్సనల్ మేనేజర్ రామశాస్త్రి పాల్గొన్నారు.

మద్యం పట్టివేత



పట్టుబడిన బాటిళ్లతో నిందితుడు రమేశ్

బెల్లంపల్లి: బెల్ట్‌షాప్‌నకు అమ్మకానికి తీసుకెళ్తున్న మద్యం బాటిళ్లను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ బన్సీలాల్ కథనం ప్రకారం.. బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి గ్రామానికి చెందిన అనవేని సంపత్ కాంటా ఏరియాలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డాడు. అతని వద్ద ఉన్న సంచిని తనిఖీ చేయగా 35 మద్యం బాటిళ్లు లభించగా స్వాధీనం చేసుకున్నారు.

కాంటాచౌరస్తాలో..

బెల్లంపల్లి మండలం సోమగూడెం గ్రామానికి చెందిన బానోతు రమేశ్ వద్ద కాంటాచౌరస్తాలో వన్‌టౌన్ పోలీసులు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఇంటి వద్ద నిర్వహిస్తున్న బెల్ట్ షాపులో మద్యం బాటిళ్లను అమ్మడానికి తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. నిందితుడి వద్ద 20 మద్యం బాటిళ్లు లభించినట్లు ఎస్‌హెచ్‌ఓ బన్సీలాల్ తెలిపారు. ఇరువురిపై కేసు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

గోల్డ్‌మెడల్‌కు ఎంపిక



కాసిపేట: మండలంలోని దేవాపూర్‌కు చెందిన గడ్డం పురుషోత్తం కూతురు గడ్డం మేఘన ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్‌ఎల్‌బీలో గోల్డ్ మెడల్‌కు ఎంపికైంది. 2021–22సంవత్సరానికి సంబంధించి యూనివర్సిటీ టాపర్, మహిళా విభాగంలో ప్రథమస్థానం పొందడంతో రెండు గోల్డ్‌మెడల్‌లు మేఘన కైవసం చేసుకుంది. మంగళవారం నిర్వహించే కన్వకేషన్‌లో అవార్డులు అందుకోనుంది.

తాగిన మైకంలో హోంగార్డు వీరంగం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ పీఎస్‌లో పనిచేస్తున్న హోంగార్డు తాగిన మైకంలో వీరంగం సృష్టించాడు. కాంగ్రెస్ ప్రచార రథం వాహనం సోమవారం హాజీపూర్ వీధుల్లో తిరుగుతూ మండల జాతీయ రహదారిపై చేరగా ఆపిన సదరు హోంగార్డు.. వాహన డ్రైవర్ మహేంద్రను దుర్భాషలాడుతూ చేయి చేసుకున్నాడు. తాగిన మత్తులో హోంగార్డు చేస్తున్న హంగామాను స్థానికులు అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని స్టేషన్‌కు తీసుకెళ్లారు. దాదాపు 20 నిమిషాల పాటు హోంగార్డు వీరంగంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. కాగా, ఎస్సై నరేశ్‌కుమార్‌ను ఈ విషయంపై వివరణ అడగగా హోంగార్డు మద్యం తాగి విధులు నిర్వర్తిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ ఘటనపై సీఐ సంజీవ్‌కు సమాచారం అందించి అతని తిరిగి పంపించినట్లు తెలిపారు.

'ఆధార్' ఇక్కట్లు..



ఆధార్ కేంద్రం వద్ద ప్రజల క్యూ

మంచిర్యాలఅర్బన్: బోగస్ రేషన్‌కార్డులు తొలగించాలనే ఉద్దేశంతో చేపట్టిన రేషన్ ఈకేవైసీతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. తెల్ల రేషన్‌కార్డులో పేర్లు ఉన్న కొందరు లబ్ధిదారులు వేలిముద్రలు రావట్లేదని ఆధార్ కేంద్రాలకు క్యూ కడుతున్నారు. ఉదయం నుంచే బారులు తీరుతున్నారు. నిర్వాహకులు టోకెన్ నెంబర్లు ఇస్తూ బయోమెట్రిక్ అప్‌డేట్ చేస్తున్నారు. గంటల తరబడి అక్కడ వేచిచూడాల్సిన పరిస్థితి.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పదేళ్లకోసారి ఆధార్ కార్డు అప్‌డేట్, రేషన్ ఈ–కేవైసీ తప్పనిసరితో ప్రజలు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. జిల్లా వ్యాప్తంగా ఆధార్ నమోదు కేంద్రాల వద్ద నిత్యం పెద్ద సంఖ్యలో వచ్చే వారితో కిటకిటలాడుతున్నాయి. పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల వివరాలు విద్యాశాఖ ఆధార్ అప్‌గ్రేడ్ చేసుకోవాలని సూచించింది. ఈ క్రమంలో ఆధార్ కేంద్రాలకు రద్దీ పెరుగుతోంది. కొన్ని కేంద్రాలు టోకెన్‌లు ఇస్తూ ఆధార్ నమోదు చేస్తోంది. టోకెన్‌లు లేని కేంద్రాల వద్ద పిల్లలు, పెద్దలు బారులు తీరుతునారు. ఉదయం 6 గంటల్లోనే కేంద్రాలకు చేరుకుని చెప్పులు వరుసలో పెట్టుకుంటున్నారు.



మంచిర్యాల ఆధార్ నమోదు కేంద్రం వద్ద వరుసలో ఉంచిన పాదరక్షలు


అడవుల సంరక్షణకు పాటుపడాలి



వాచ్‌టవర్ ప్రారంభిస్తున్న ఎఫ్‌బీఓ

వేమనపల్లి(బెల్లంపల్లి): అడవుల సంరక్షణకు అటవీ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని బెల్లంపల్లి ఎఫ్‌బీఓ వినయ్‌కుమార్‌సాహు అన్నారు. ఎఫ్‌ఆర్‌ఓ గోవింద్‌చంద్‌సర్దార్‌తో కలిసి సోమవారం వేమనపల్లి అటవీ సెక్షన్‌లోని కొత్తపల్లి బీట్ పరిధిలోకి వచ్చే అటవీ ప్రాంతంలో రూ.12లక్షలతో నిర్మించిన ఫైర్ వాచ్‌టవర్‌ను ఆయన ప్రారంభించారు. అడవుల్లో కార్చిచ్చులు ఏర్పడితే వాచ్‌టవర్ ద్వారా పర్యవేక్షణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ లక్ష్మీనారాయణ, ఎఫ్‌ఎస్‌ఓలు రవికుమార్, మల్లయ్య, ఎఫ్‌బీఓలు పోచన్న, శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఓట్.. నాట్ ఫర్ సేల్



నర్సాపూర్(జి): అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నందున మండల కేంద్రానికి చెందిన యువకుడు ఎండీ జాబీర్ ఓ సందేశాన్ని తమ ఇంటి గోడపై రాయించాడు. 'ఈ ఇంటి ఓట్లు అమ్మబడవు 'ఓటు ఆయుధం దానిని మతం కోసమో! కులం కోసమో! దబ్బు కోసమే! వృథా చేయికండి..అని రాయించి ఓటర్లను ఆలోచించేలా చిన్న ప్రయత్నం చేశాడు.

తాళ్లపేటలో తొలి పోలింగ్ కేంద్రం



నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో మంచిర్యాల నియోజకవర్గం ఏర్పాటైంది. దీని పరిధిలోకి దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్, మంచిర్యాల, నస్పూర్ మండలాలు వస్తాయి. నియోజకవర్గంలో మొత్తం 287 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఇందులో తొలి పోలింగ్ కేంద్రం దండేపల్లి మండలం తాళ్లపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉంది. దీంతో నియోజకవర్గంలో దండేపల్లి మండలానికి ప్రత్యేక స్థానం ఉంది. – దండేపల్లి

రక్షణ సూత్రాలపై అవగాహన ఉండాలి



షీల్డ్ అందుకుంటున్న కేకే–5 గని మేనేజర్

మందమర్రిరూరల్: సింగరేణిలో ప్రతి ఉద్యోగి రక్షణ సూత్రాలపై అవగాహన ఉండాలని సేఫ్టీ కమిటీ కన్వీనర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. సింగరేణి 54వ రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం ఏరియాలోని కేకే–5 గనిని రక్షణ కమిటీ సందర్శించింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం ప్రమాదాల సంఖ్య తగ్గాయన్నారు. రక్షణ పట్ల యాజమాన్యం ఎప్పటికప్పుడు ఉద్యోగులకు అధునిక పరి/జ్ఞానంతో కూడిన శిక్షణ అందిస్తోందన్నారు. రక్షణ సూత్రాలు పాటిస్తూ సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తిని సాధించాలని సూచించారు. గనిలో అధికారులు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు సమష్టిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడంతోనే ప్రమాదాల సంఖ్య తగ్గిందన్నారు. గతేడాది రక్షణ పక్షోత్సవాల్లో గెలుపొందగా బహుమతిగా షీల్డ్‌ను గని మేనేజర్ భూశంకరయ్య అందుకున్నారు. కమిటీ సభ్యులు (ఏజీఎం) కేహెచ్‌ఎస్ గుప్తా, ప్రవీణ్‌విక్రం, సాయినాథ్, శ్రీనివాసులు, ప్రదీప్‌కుమార్, శ్రీనివాసరావు, ఏజెంట్ రామదాసు, ఇంజినీర్ రాంప్రసాద్ ఉన్నారు.

ఓసీని సందర్శించిన రక్షణ కమిటీ

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ ఓసీని సోమవారం రక్షణ కమిటీ బృందం సందర్శించింది. ఏరియా జీఎం మనోహర్, బృందం కన్వీనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రక్షణ విషయంలో కార్మికులు ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సంస్థకు బొగ్గు ఉత్పత్తి కన్నా కార్మికుల రక్షణే ముఖ్యమనేది గుర్తించాలన్నారు. సేఫ్టీ విషయంలో రాజీపడకుండా ప్రమాదాలు లేని గనిగా ఓసీని తీర్చిదిద్దాలని అన్నారు. అనంతరం రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, మేనేజర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.